ఈనాడు
నిర్మల్
మంగళవారం అక్టోబరు 8, 2024

రేషన్ బియ్యాన్ని తినేదెలా?

కనిపించని నాణ్యత

న్యూస్‌టుడే, నిర్మల్ పట్టణం :

రేషన్ దుకాణాల్లో సరఫరా చేస్తున్న రాయితీ బియ్యంలో నాణ్యత లోపిస్తోంది. క్షేత్ర స్థాయిలో నాసిరకం బియ్యం పంపిణీ కావడంతో ప్రభుత్వం అపవాదును మూటగట్టుకుంటోంది. అధికారులు పంపిణీ ప్రక్రియను మొక్కుబడిగా మార్చేసి లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ బియ్యం తినడానికి కాదు.. బయట అమ్ముకునేందుకో, లేక ఇతర అవసరాలకు వాడుకునేందుకు అన్నరీతిలో పరిస్థితి తయారైంది.


నూకలు ఎక్కువగా ఉన్న బియ్యం..

తప్పని వాగ్వాదం..

రేషన్ దుకాణాల్లో పంపిణీ చేస్తున్న బియ్యం చూసి చాలామంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. డీలర్లే కావాలని నాసిరకంగా ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో లబ్ధిదారులు- డీలర్ల మధ్య తరచూ వాగ్వాదం చోటుచేసుకుంటోంది. తమకు వచ్చిన వాటినే ఇస్తున్నాం తప్ప ప్రత్యేకంగా తీసుకురాలేం కదా అంటూ డీలర్లు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి నెలా స్థానికంగా ఈ తలనొప్పి వ్యవహారం తప్పటంలేదని వారు వాపోతున్నారు. ఉన్నతాధికారులకు చెప్పినా ఫలితం ఉండటం లేదంటున్నారు.

రంగుమారి.. నూకలు చేరి

పేదలైనా, ఉన్నవారైనా అన్నం తినేందుకు ప్రాధాన్యమిస్తుంటారు. డబ్బులున్నవారు కాస్త సన్నబియ్యానికి ప్రాధాన్యమిస్తారు. పేదలు దొడ్డురకాన్ని ఎంచుకుంటారు. ప్రధాన కారణం ధరలో వ్యత్యాసమే. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రేషన్‌దుకాణాల్లో రాయితీ బియ్యం పంపిణీ చేస్తున్నాయి. కిలో రూ. 1 మాత్రమే లబ్ధిదారుల నుంచి తీసుకుంటున్నాయి. ప్రస్తుతం ఉచితంగా ఇస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చంతా ప్రభుత్వాలే భరిస్తున్నాయి. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పలుచోట్ల బియ్యం పంపిణీ ప్రారంభమైంది. చాలాచోట్ల నూకలు ఎక్కువగా ఉన్నవి, వడ్లతో ఉన్నవి, రంగు మారినవి, తినడానికి వీల్లేకుండా ఉన్నవి, ఇతరత్రా వ్యర్థాలు కలిసిఉన్నవి.. ఇలా ఇష్టారీతిన ఉన్న బియ్యం సరఫరా చేస్తున్నారు.

తినలేక విక్రయం..

ప్రస్తుతమున్న పరిస్థితుల్లో మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులను ఎదుర్కొనేందుకు చాలావరకు నాన్‌పాలిష్ బియ్యం కావాలని కోరుకుంటున్నారు. ఇందు కోసం కొంతమంది ప్రధానంగా రేషన్‌బియ్యంపై ఆసక్తి చూపుతుంటారు. బయట మార్కెట్‌లో లభించేవి బాగా పాలిష్ చేయబడి ఉంటాయి. వాటిలో తీపి పదార్థం పరిమాణం ఎక్కువగా ఉంటుంది. రేషన్‌దుకాణాల్లో పంపిణీ అవుతున్న బియ్యం తినేందుకు అవకాశం లేకుండా ఉండటంతో గత్యంతరం లేక వీరు రైస్‌మిల్లులను ఆశ్రయిస్తున్నారు. ధర ఎక్కువైనా చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు. అదేసమయంలో.. బియ్యం తీసుకోకపోతే రేషన్ కార్డు పోతుందన్న భయంతో చాలామంది లబ్ధిదారులు తమ కోటాను తీసుకుంటున్నారు. కానీ, నాసిరకంగా ఉన్న ఆ బియ్యం తినలేక, బయటపడేయలేక మార్కెట్‌లో దళారులకు అమ్ముకుంటున్నారు.


వడ్లతో ఇలా..

జిల్లా వివరాలు ఇలా..

మండలాలు:	19
రేషన్ దుకాణాలు:	412
తెల్లరేషన్ కార్డుదారులు	2,10,093

9 నుంచి సదరం శిబిరం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మీ సేవా ద్వారా స్లాట్ బుక్ చేసుకుని వెయిటింగ్ లిస్టులో ఉన్న దివ్యాంగుల చరవాణికి సంక్షిప్త సమాచారం వచ్చిన ఆయా తేదీల్లో నిర్మల్‌లోని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సదరం శిబిరానికి హాజరుకావాలని డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు. బుధవారం శారీరక, 17న మానసిక, 24న కంటి, 30న వినికిడికి సంబంధించిన పరీక్షలు వైద్యులు చేపట్టనున్నారని పేర్కొన్నారు.

రూ. వేల కోసం.. లక్షల్లో నష్టం

రాగితీగ చోరులతో ఇబ్బందిపడుతున్న రైతులు, విద్యుత్తు శాఖ

న్యూస్‌టుడే, భైంసా :

దుండగులు రాగి లభించే పాత నియంత్రికలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఎందుకంటే కొత్తగా తయారు చేస్తున్న వాటిలో రాగిని వినియోగించడం లేదు. పంట చేలలో బోరు మోటార్ల కోసం ఏర్పాటు చేసిన నియంత్రికలు వారి చేతిలో ధ్వంసమవుతున్నాయి. ఏడాది కాలంగా పట్టణ పరిసరాలతో పాటు డివిజన్‌లోని ఆయా మండలాల్లో నియంత్రికలు తరచూ చోరీకి గురవుతున్నాయి. వాటిపై ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఒక్కరూ పట్టుబడక పోవడం పోలీసులకు సవాలుగా మారింది.



- ఈ నెల 5న భైంసా మండలం ఇలేగాం ఫిడర్‌లోని దేగాం శివారులో గుర్తుతెలియని వ్యక్తులు సంజీవ్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలోని నియంత్రిక ధ్వంసం చేసి రాగిని దొంగిలించారు. సుదర్శన్‌రెడ్డి, భోజరాం పటేల్, సాయినాథ్ పంట చేలలోని నియంత్రికల్లోని రాగిని సైతం దొంగిలించారు.
- 6న భైంసా పట్టణ శివారులో ఒక వ్యవసాయ క్షేత్రంలో 25 కేవీ నియంత్రిక ధ్వంసమైంది.
- ఇటీవల కుభీరు మండలంలో దుండగులు రెండు నియంత్రికలను ధ్వంసం చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

రూ.15 వేల కోసం రూ.లక్ష నష్టం

ఒక 25 కేవీ నియంత్రికలో 6హెచ్‌వీ, 12 ఎల్‌వీ కాయిల్స్‌లో కంపెనీని బట్టి సుమారు 38 కిలోల వరకు రాగి లభ్యమవుతోంది. దొంగల బెడద, ఉత్పత్తి వ్యయం ఎక్కువ కావడంతో ఇటీవలి కాలంలో తయారు చేసిన కొత్త నియంత్రికల్లో రాగి వినియోగించడం లేదని తెలుసుకున్న దొంగలు పాత నియంత్రికలనే లక్ష్యంగా చేసుకున్నారు. సాధారణంగా మార్కెట్లో పాత రాగి కిలోరూ. 800 వరకు పలుకుతోంది. కాగా నియంత్రికల్లో దొంగిలించినే రాగి అందులో సగం ధరకు అమ్మే అవకాశం ఉంది. లభ్యమైన రాగి తీగలను పట్టణంలోని పాత సామాన్లు, రాగి, ఇత్తడి వ్యాపారులు, ఎలక్ట్రికల్ వ్యాపారులకు దొంగచాటుగా విక్రయిస్తున్నట్లు సమాచారం. దొంగ సొత్తు కొనడం నేరమని తెలిసినా కొందరు సగం ధరకే లభించడంతో కొనుగోలు చేస్తున్నారు. ఇలా నియంత్రికలను ధ్వంసం చేసిన విక్రయిస్తున్న రాగికి దుండగులకు వచ్చే ఆదాయం రూ.15 నుంచి రూ.20 వేలే. దానికి రూ.లక్ష విలువైన నియంత్రికలను ధ్వంసం చేసి రాగిని దొంగిలిస్తున్నారు.


దేగాం శివారులో ధ్వంసం చేసిన 25కేవీ నియంత్రిక

ఫిర్యాదు చేశాం..

వ్యవసాయ క్షేత్రాల్లో నియంత్రికలను దుండగులు ధ్వంసం చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు ఒక్కరు కూడా పట్టుబడలేదు. రైతులు ఒక కన్నేసి ఉంచాలి. అనుమానితులు ఎవరైనా నియంత్రికల వద్ద కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

- ఆదిత్య కదం, ఏడీఈ, భైంసా డివిజన్

ప్రత్యేక బృందాల ఏర్పాటు

నియంత్రికల్లోని రాగి దొంగిలించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. క్రైం డిటెక్టివ్ టీం పనిచేస్తుంది. తాజాగా దిలావర్‌పూర్‌లో ఇద్దరిని, తానూరులో నలుగురిని పట్టుకున్నాం. ఎక్కడెక్కడ ఏ దొంగతనాలు చేశారో విచారణ చేపడుతున్నాం.

- ఏఎస్పీ అవినాశ్ కుమార్, భైంసా

సోయా కొనుగోళ్ల పరిమితి పెంచాలి


వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, న్యూస్‌టుడే : గతంలో కంటే ఈ ఖరీఫ్‌లో సాగు చేసిన సోయా పంట దిగుబడులు అధికంగా వస్తున్నాయని, కొనుగోళ్ల పరిమితిని సడలించాలని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్ల పరిమితిని పెంచి, ప్రతి ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్లను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఆటోలను నియంత్రించండి


ఎస్పీ జానకి షర్మిలకు కానుక అందజేస్తున్న డీఎం ప్రతిమారెడ్డి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : నిర్మల్ ప్రయాణప్రాంగణంలో ఆటోల ఆగడాలు ఎక్కువ అవుతున్నాయని, వాటిని నియంత్రించాలని ఆర్టీసీ డిపో మేనేజరు ప్రతిమారెడ్డి జిల్లా పోలీసు అధికారి డా.జి.జానకి షర్మిలకు విన్నవించారు. సోమవారం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన ఆమె ముందస్తు దసరా, బతుకమ్మ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోలతో బస్సుల రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలని కోరారు. అంతకుముందు జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్‌ను కలిసి పండగ శుభాకాంక్షలు చెప్పారు. మహాలక్ష్మి పథకం అమలుతీరు, బస్టాండ్‌లో వసతులు, ఇబ్బందులు తదితర అంశాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

మహాలక్ష్మి.. కరెన్సీ అలంకరణలో దర్శనమిచ్చి

నిర్మల్, న్యూస్‌టుడే : నిర్మల్ పట్టణం ద్యాగవాడ హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గమ్మను సోమవారం రూ. 7,33,999 విలువైన నగదుతో మహాలక్ష్మిగా అలంకరించారు. రూ.100, రూ.200, రూ.500 నోట్ల కరెన్సీతో అమ్మవారిని ముస్తాబు చేశారు. మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.


రూ.7,33,999 విలువైన కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ

అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించి

ప్రజావాణిలో బాధితుల గోడు

నిర్మల్, న్యూస్‌టుడే : తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలంటూ కలెక్టరేట్‌కు అర్జీదారులు తరలివచ్చి అధికారు వినతి పత్రాలు అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ల కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, లతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. వారి సమస్యలను ఓప్పిగ్గా విన్న ఆమె వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరమే తీర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.


సమస్యలు వింటున్న జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్

రోడ్లు, మురుగు కాలువలు లేక ఇబ్బందులు



మేము సోఫినగర్ నుంచి శాంతినగర్ వెళ్లే మార్గమైన దర్గా వెనుక ప్రాంతంలో నివసిస్తున్నాం. మా కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. రహదారులు, మురుగు కాలువలు సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

ఇంటి స్థలం ఇప్పించండి



నా పేరు రజియాబేగం. నిర్మల్ పట్టణం పాన్‌గల్లి ప్రాంతం. 2008లో సోఫినగర్‌లో ఇందిరమ్మ ఇంటి స్థలం కేటాయించి పట్టా ఇచ్చారు. పూర్తిగా ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో పునాది దశలోనే పనులు ఆపేయాల్సి వచ్చింది. ఇప్పుడు నా ఇంటి స్థలంలో ఇతర వ్యక్తులు వచ్చి నిర్మాణం చేస్తున్నారు. దీనిపై పూర్తి విచారణ జరిపించి నా ఇంటి స్థలం నాకు వచ్చేలా న్యాయం చేయాలి.

పింఛను మంజూరు చేయరూ..



మా బాబు పేరు బస్రె సుధీర్. చిన్నప్పటి నుంచి నడవలేని పరిస్థితి. మాది భైంసా మండలం మాటేగావ్ గ్రామం. రెండేళ్లక్రితం పింఛను పత్రం (సదరం) అధికారులకు ఇచ్చాం. అప్పటి నుంచి పింఛన్ మంజూరు చేయించాలని విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

న్యాయం చేయండి



నా పేరు రమేశ్. కుభీరు మండలం రంజని గ్రామం. 1.20 ఎకరాల భూమి ఉండగా.. 16 గుంటల భూమిని ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల నిర్మాణానికి ఇచ్చాం. మిగతా 1.04 ఎకరాల భూమి ధరణి రికార్డులో ఉన్నా. క్షేత్ర స్థాయిలో తక్కువగా ఉంది. కొలతలు చేసి ఇవ్వాలని రెండేళ్లుగా అధికారులకు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. నా హక్కు అడిగితే గ్రామం నుంచి బహిష్కరించారు. నా సమస్యకు పరిష్కారం చూపించి న్యాయం చేయాలని కోరుతున్నా.

కార్మికుల వేతనాలు అందజేయాలి : మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే, భాజపా శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ పురపాలిక కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కమిషనర్ సి.వి.ఎన్.రాజు తదితరులతో సమావేశమయ్యారు. కార్మికులు, సిబ్బంది వేతనాలు వెంటనే అందజేయాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ వేగవంతం చేయాలని చెప్పారు. పుర కమిషనర్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా జీతాలు ఒక నెలకు సంబంధించినవి కొందరి ఖాతాల్లో జమ అయ్యాయని, మిగితా వారి బకాయిలు, సమస్యలను ఒకటి రెండు రోజుల్లో పరిష్కరిస్తామని వెల్లడించారు. కాగా ఎన్‌పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు ఫసియుద్దీన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్ తదితరులు పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపారు.


కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

బాసరకు 16 నుంచి కాజీపేట- దాదార్ ప్రత్యేక రైలు

ముథోల్(బాసర),న్యూస్‌టుడే : కాజీపేట నుంచి దాదార్ 07195 వీక్లి ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 16న ప్రారంభించనున్నారు. ఆరునెలల క్రితం ఈ రైలును నిలిపివేసిన అధికారులు పునఃప్రారంభించనున్నారు. ఈ రైలు కాజీపేట నుంచి వారానికి ఒక సారి ఉదయం 10 గంటలకు బయలుదేరి కాజీపేట, జమ్మికుంట, పెద్దపల్లి, కరీంనగర్, లింగంపేట, జగిత్యాల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ఉమ్రి, ముథ్కేడ్, నాందేడ్, పూర్ణ, పర్భాని, సెలు, పర్థూర్, జాల్నా, ఔరంగాబాద్, లాసూర్, రోటేగావ్, నాగర్‌సోల్, మన్మాడ్, నాసిక్, ఇగాద్‌పూరి, కల్యాణ్ మీదుగా దాదార్ వరకు వెళ్తుంది. దీంతో కాజీపేట్ నుంచి నేరుగా బాసరకు వచ్చే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఆసుపత్రి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, కావాల్సిన మౌలిక వసతుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా.అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. వార్డులు, ల్యాబ్, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వాసుపత్రి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్, బోధనాసుపత్రి పర్యవేక్షకుడు గోపాల్‌సింగ్, జిల్లా వైద్యాధికారి రాజేందర్, డీసీహెచ్ఎస్ (ఆరోగ్య సేవల జిల్లా సమన్వయకర్త) సురేశ్ తదితరుల ఆధ్వర్యంలో ఆసుపత్రి అంతా పరిశీలించామన్నారు. అందుబాటులో ఉన్న పడకలు, మంజూరైన ఉద్యోగాలు, భర్తీ, ఖాళీలు తదితర వివరాలు నమోదు చేసినట్లు చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని, ఇంకా కావాల్సినవి ఏవైనా ఉంటే కొనుగోలు చేసేందుకు నిధులున్నాయన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కాలానుగుణ వ్యాధుల తీవ్రత తగ్గిందన్నారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ పనిచేయడం లేదన్న ప్రశ్నకు వివరణగా.. ప్రస్తుతానికి దానివల్ల వచ్చిన ఇబ్బందేమీ లేదన్నారు. కావాల్సినన్ని ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.


రోగితో మాట్లాడుతున్న తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనరు డా.అజయ్‌కుమార్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డీఎస్పీ

నిర్మల్ పట్టణం: దసరా శరన్నవరాత్రి, బతుకమ్మ వేడుకల నేపథ్యంలో ప్రభుత్వం సూచించిన నిబంధనలు విధిగా పాటించాలని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. పట్టణ పోలీస్టేషన్‌లో సోమవారం డీజే నిర్వాహకులు, యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉత్సవాల్లోనే కాకుండా, కార్యక్రమాల్లోనూ డీజేల వినియోగంపై నిషేధం ఉందని స్పష్టంచేశారు. తగిన అనుమతి లేకుండా ఎవరు డీజేలు ఏర్పాటు చేసినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కలల సౌధం?? చిక్కులు అనేకం

న్యూస్‌టుడే, శ్రీరాంపూర్

ఇంటి నిర్మాణం ప్రతిఒక్కరి కల.. కొందరు యుక్త వయసులో.. మరికొందరు ఉద్యోగ విరమణ తరువాత కలల సౌధం నిర్మించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం బాగా పెరిగింది. కొత్త జిల్లా కేంద్రాలతోపాటు శివారు ప్రాంతాల్లో వీటిని నిర్మించుకుంటున్నారు. అయితే అనుభవ లేమి నిర్మాణదారులను కష్టాల పాల్జేస్తోంది. నిర్మాణదారులు కష్టాలు, నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

నస్పూర్‌లో నివసించే తిరుపతిరెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం తన కొడుకుల సలహా మేరకు పనిచేసిన ప్రాంతంలోనే ఇల్లు కట్టుకోవాలని అనుకున్నారు. భవిష్యత్తులో చిక్కులు వద్దనుకుని డీటీసీపీ లే అవుట్‌లో ఇంటి నిర్మాణానికి బిల్డర్‌ను సంప్రదించారు. నిర్మాణం సగానికిపైగా పూర్తయిన తర్వాత పనులు ముందుకు సాగడం లేదు. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 80 శాతం డబ్బులు చెల్లించారు. చేయాల్సిన పనేమో 40 శాతం మేరకు ఉంది. ఇదేమని అడిగితే అప్పటికీ, ఇప్పటికీ ధరలు పెరిగాయని, తానే అదనంగా ఖర్చు పెట్టి నష్టపోయానంటూ బిల్డర్ మాట మార్చాడు. అదనంగా మరింత సొమ్ము వెచ్చించి ఇంటి నిర్మాణం పూర్తి చేసేసరికి అంచనాలు బాగా పెరిగాయి.

యువ ఉద్యోగి కుమార్ ముందు చూపుతో బ్యాంకు రుణం తీసుకుని మంచిర్యాలలో ఇంటి నిర్మాణం చేపట్టారు. తానే కష్టపడి అన్నీ దగ్గరుండి చూసుకోవాలనుకుని తాపీ మేస్త్రీని మాట్లాడుకున్నారు. తెల్లకాగితంపై ఒప్పందం రాసుకున్నారు. ఎలివేషన్ పనితోపాటు, పిట్టగోడల నిర్మాణం, ఇతర పనుల వద్ద మేస్త్రీ మొరాయించడం మొదలు పెట్టాడు. ఇదేమని అడిగితే తనకు గిట్టుబాటు కాదని, అదనంగా సొమ్ము కావాలన్నాడు. మరొకరిని పెట్టుకుందామంటే తాపీ మేస్త్రీల సంఘం అంగీకరించదు. చేసేదేమీలేక అడిగినంత ఇచ్చుకుని పని పూర్తి చేయించాడు. అదనంగా రూ. 15 లక్షలు ఖర్చయింది. ఎలక్ట్రీషియన్ ఇబ్బడిముబ్బడిగా రకరకాల వైర్లు తెప్పించి, అవసరం ఉన్న దానికన్నా రెట్టింపు వినియోగించినట్లు కాకి లెక్కలు చెప్పాడు. అందరికీ సంఘాలు ఉన్నాయి. ఇల్లు కట్టుకునే వినియోగదారుడికి ఎలాంటి రక్షణ లేదని బాధితుడు వాపోయారు.

అనుభవలేమితో ఇబ్బందులు


కొత్తగా ఇల్లు కట్టుకోవాలనుకునే వారు మిగతా వారి కన్నా కాస్త భిన్నంగా, కొత్తహంగులతో ఉండాలని అనుకోవడం సహజం. కానీ నిర్మాణ సమయంలో చిక్కులు ఎదురై అనేక మంది వివిధ విషయాల్లో ఫిర్యాదులు చేస్తుంటారు. వాటికి సరైన పరిష్కార మార్గాలు లభించడం లేదు. అధిక మొత్తం డబ్బులు వెచ్చించి అప్పులపాలు కావడం లాంటివి జరుగుతున్నాయి. జీవితంలో ఒకసారి మాత్రమే ఇల్లు కట్టుకునేవారు నూటికి 99 శాతం ఉంటారు. ఇల్లు కట్టాలని నిర్ణయించుకున్న వెంటనే దళారులో, తెలిసిన వారో రకరకాల సలహాలు ఇస్తారు. కొందరేమో ఎంతో కొంత డబ్బు ఆదా అవుతుందని సొంతంగా ఇంటిని నిర్మించుకుంటారు. ఇవన్నీ తలనొప్పి వ్యవహారాలు అనుకునే వారు గుత్తేదారు (బిల్డర్)కి అప్పగిస్తున్నారు. వారు ముందు చెప్పేది ఒకటి, తర్వాత చేసేది మరోటి ఉండటంతో పంచాయితీలు, పోలీసులను ఆశ్రయించడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

- ఇల్లు కడితే కష్టాలు.. కట్టిస్తే నష్టాలు..
- సూచనలు పాటిస్తేనే మేలు


మంచిర్యాలలో నిర్మాణంలో ఉన్న భవనాలు

నిపుణులేమంటున్నారంటే..

- ఇల్లు కట్టే ముందు అనుభవజ్ఞులను సంప్రదించాలి. ఇంజినీరింగ్ నిపుణుల సలహా మేరకు ముందుగానే నిర్మాణంలో ఏమేం ఇమిడి ఉంటాయనే విషయాన్ని తెలుసుకోవాలి. వాటి ప్రకారం ఒప్పంద పత్రాన్ని నోటరీ సమక్షంలో రాసుకోవాలి.
- కొందరు ఆయా సంఘాలు నిర్ణయించిన రేట్‌ను బుక్ రేటు అంటారు. ఇంకొందరు, స్లాబ్‌రేటు (చదరపు అడుగుల లెక్కన) ప్రకారం ధరలు నిర్ణయిస్తారు. ఎలివేషన్‌తో సహా ప్రతీ అంశాన్ని ముందుగానే నిర్ణయించుకుని ఆ ప్రకారం పని చేసేలా ఒప్పందం చేసుకోవాలి.



- విద్యుత్తు, ప్లంబింగ్, ఇంటీరియర్, తలుపులు, కిటికీల విషయంలో నిపుణుల సలహా మేరకు నాణ్యమైన వస్తువులను ప్రస్తావించాలి. ఎంత పనికి ఎంత మొత్తం వస్తువులు అవసరం అవుతాయో అంచనా వేయించుకుని ఒప్పంద పత్రంలో రాయించుకోవాలి. అప్పుడే కొంత మేరకు మోసాలు జరగకుండా ఉంటాయి.
- వస్తువుల కొనుగోలు సమయంలో నాణ్యతను పాటించే డీలర్లను ఎంపిక చేసుకోవాలి. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా కొనుగోలు చేస్తే, దళారుల కమీషన్ల బాధ తప్పుతుంది.

ఆటోను ఢీకొని ఒకరి దుర్మరణం

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంతో ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టి వ్యక్తి దుర్మరణం చెందినట్లు జగిత్యాల జిల్లా మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన అడ్లూరి నర్సయ్య(40) తన ద్విచక్రవాహనంపై పాతదాంరాజుపల్లి గ్రామం నుంచి ఖానాపూర్ వైపు వెళ్తున్నాడు. గ్యాస్ సిలిండర్లు డెలివరీ కోసం సంగెంలో రహదారిపై నిలిపి ఉంచిన ఆటోను వెనుక నుంచి ఢీకొట్టడంతో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందారు. నిబంధనలు పాటించకుండా రహదారిపై ఆటోను నిలిపి ఉంచడంవల్లే ప్రమాదం జరిగినట్లు ఎస్సై తెలిపారు.

మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం

నర్సాపూర్(జి), న్యూస్‌టుడే : మండలంలోని రాంపూర్ గ్రామ ఎర్రకుంటలో శనివారం ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన శవం ఆచూకీ సోమవారం లభ్యమైంది. నర్సాపూర్(జి) ఎస్సై హన్మాండ్లు తెలిపిన కథనం మేరకు.. సారంగాపూర్ మండలం ఆదివాసిగూడ గ్రామానికి చెందిన బూర్కె శివాజీ (46) కొన్నేళ్ల క్రితం కూలీ పనుల కోసం రాంపూర్ గ్రామానికి వలస వచ్చాడు. రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లాడని మద్యం మత్తులో కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో చెరువులో మునిగి మృతి చెందాడని భావిస్తున్నామని పోలీసులకు కుటుంబసభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.


శివాజీ

వ్యక్తి అదృశ్యంపై కేసు

లోకేశ్వరం, న్యూస్‌టుడే : మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన ముస్కు ఎర్రన్న కనిపించట్లేదు. ఎస్సై అశోక్ కథనం మేరకు.. ఎర్రన్న గత నెల 29న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి వెతికినా ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో భార్య భోజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కత్తితో దాడి చేసిన నిందితుడి రిమాండ్

కడెం, న్యూస్‌టుడే : పాత కక్షలతో పగ పెంచుకుని హత్యచేసే ఉద్దేశ్యంతో సోమవారం కొత్తమద్దిపడిగలో మక్కి శ్రీనివాస్‌పై అదే గ్రామానికి చెందిన నక్కలపేట అశోక్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి కథనం మేరకు.. గతంలో పలుసార్లు వీరు గొడవ పడ్డారు. దీంతో ఉదయం శ్రీనివాస్ ఇంటి ఎదుట నిల్చొని రెచ్చగొడుతూ తిడుతూ గొడవ చేస్తుండగా ఎందుకు తిడుతున్నావని అశోక్‌ను శ్రీనివాస్ ప్రశ్నించాడు. ఆగ్రహంతో అశోక్ తన వెంట తెచ్చుకున్న కత్తితో శ్రీనివాస్‌పై దాడికి పాల్పడగా ఆయనకు గాయాలయ్యాయి. బాధితుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చర్యలు

లోకేశ్వరం, న్యూస్‌టుడే : ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకంలో ఇకపై ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు సంబంధిత డీఈఈ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఇందుకోసం మండలంలోని ప్రతి పంచాయతీకి ఒకరిని నియమించామని, వారికి నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సోమవారం శిక్షణ తరగతులను ప్రారంభించి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ వెంకటరమేష్, ఎంపీఈఓ సల్మాన్‌రాజ్, వాటర్‌గ్రిడ్ ఏఈ సుమన్, శిక్షకులు భూమేశ్, సందీప్‌లు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మిషన్ భగీరథ డీఈఈ లక్ష్మీనారాయణ

ఖానాపూర్ : పట్టణంలోని ఎంపీడీవో సమావేశహాలులో గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు నీటి సరఫరా శాఖ అధికారులు పాల్గొన్నారు.

హమాలీ ధరల పెంపుపై హర్షం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : పౌరసరఫరాల గోదాముల్లో విధులు నిర్వహిస్తున్న హమాలీల ధరలు పెంచడం హర్షణీయమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. సోమవారం పౌరసరఫరాల హమాలీ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మిఠాయి తినిపించుకుని సంబరాలు జరిపి మాట్లాడారు. బస్తాల ఎగుమతి, దిగుమతి రేట్లను రూ.26 నుంచి రూ. 28కి, పండగ మిఠాయి కోసం రూ.900, బోనస్ రూ.7,500, దుస్తుల కుట్టుకూలీ రూ.1,600 తదితర వాటిని పెంచి కార్మికులకు ఎంతో మేలు చేశారని పేర్కొన్నారు. ఎస్.ఎన్.రెడ్డి, పుండలిక్, సాయి, రమేశ్, బలరాం, పోశెట్టి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికులకు శిక్షణ

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే : కల్లుగీత సమయం తాటి చెట్టుఎక్కే గీతకార్మికులు పలు జాగ్రత్తలు పాటించాలని అబ్కారి సీఐలు లక్ష్మణరావు, నజీర్‌హుస్సేన్‌లు అన్నారు. సోమవారం మండలంలోని బన్సపల్లి గ్రామంలో 'కాటమయ్య రక్షణ కవచం' ఆధ్వర్యంలో గీతకార్మికులకు తాటి, ఈత చెట్టు ఎక్కే విధానంపై శిక్షణ అందించారు. సేఫ్టీ మోకులు వాడే విధానంపై తర్ఫీదు నిచ్చారు. గౌడ జన హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, ఎస్సైలు గజేందర్, వసంత్‌రావు వివిధ గ్రామాల్లో గీతకార్మికులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: వాటోలి గ్రామంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని భాజపా నాయకులు సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 2021 సంవత్సరానికి ముందు డిగ్రీ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకుని రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.


వాటోలి గ్రామంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న భాజపా నాయకులు


సదర్మాట్ బ్యారేజీకి వెళ్లే మార్గం


ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి

ఆకట్టుకునే అందం.. సదర్మాట్ ప్రాంతం

మామడ, న్యూస్‌టుడే: మండలంలోని పొన్కల్ సమీపంలో గోదావరిపై నిర్మించిన సదర్మాట్ బ్యారేజీ ప్రాంతం సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఇంకా ఆ ప్రాజెక్టును ప్రారంభించకున్నా అటు వెళ్లే దారి, అక్కడి జలసవ్వడి చూపరులకు ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రస్తుతం అన్ని గేట్లు తెరిచి ఉంచడంతో ఎగువ నుంచి వస్తున్న నీరు దిగువకు వెళ్తోంది. కొత్త ప్రాజెక్టు సిద్ధమవడంతో ఆసక్తి గల వారు వెళ్లి అక్కడి అందాలు వీక్షిస్తున్నారు.


దిగువన గోదావరి

వెలగని దీపం.. అంతా అంధకారం

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద అంధకారం నెలకొంది. జిల్లా ప్రధాన ఆసుపత్రికి, ప్రియదర్శినినగర్, గాజులపేట్ వెళ్లేందుకు ఉపయోగించే ప్రధాన రహదారి కావడంతో నిత్యం పెద్దసంఖ్యలో ప్రయాణిస్తుంటారు. రోడ్డు మధ్యలో విభాగినిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేసినప్పటికీ వాటి నిర్వహణను విస్మరించారు. ఫలితంగా అవి వెలగడం లేదు. దీంతో ఈ మార్గమంతా అంధకారం నెలకొంటోంది. సాయంత్రం తర్వాత ఈ రోడ్డుపై ప్రయాణించే పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి తగిన మరమ్మతులు చేపట్టాలని, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


వెలగకుండా ఉన్న విద్యుత్తు బల్బులు

నేడు విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదిక

కుభీరు, న్యూస్‌టుడే : కుభీరులోని విద్యుత్తు ఉప కేంద్రంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు భైంసా డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ అజిమొద్దిన్ తెలిపారు. విద్యుత్తు సమస్యలున్న కుభీరు, భైంసా పట్టణం, భైంసా రూరల్ ప్రజలు పరిష్కార వేదికకు హాజరుకావాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి జి.చంద్రశేఖర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ అభిలాష అభినవ్

జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

నిర్మల్, న్యూస్‌టుడే : అన్ని శాఖల్లో పనిచేసే అధికారులు జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి జి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశం హాలులో జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్, అధికారులతో వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా, వైద్యం, పంచాయతీరాజ్, పలు శాఖల పనితీరు, చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఆయనకు జిల్లాలో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి వివరాలను తెలిపారు. అదనపు కలెక్టర్లు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు.


కడెం: లింగాపూర్‌లో సామూహిక కుంకుమార్చనలో భక్తులు


శ్రీరామ చైతన్య యూత్ దుర్గా మాత వద్ద చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు


ఖానాపూర్‌లో దుర్గాదేవి పూజలో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ దంపతులు

దేవీ దర్శనం.. భక్తుల తన్మయత్వం

కుంటాల, ముథోల్, భైంసా, ఖానాపూర్, ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. దుర్గామాత మండపాల్లో పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారి అలంకరణ, కుంకుమార్చన, హోమం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ముథోల్‌లోని మహాలక్ష్మి కాలనీలోని దుర్గామాత దగ్గర కుంకుమపూజ చేశారు.


మస్కాపూర్‌లో దీపాలంకరణలో అమ్మవారు


భైంసాలో పాల్గొన్న ఏఎస్పీ అవినాశ్ కుమార్

వేతనాలు విడుదల చేయాలని డిమాండ్

నిర్మల్ అర్బన్ : గ్రామ పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ప్రజావాణిలో జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్‌కు, డీపీవో శ్రీనివాస్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.నర్సయ్య, ఉపాధ్యక్షుడు మల్లేశ్, సహాయ కార్యదర్శి నవీన్, నాయకులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

నిర్మల్, న్యూస్‌టుడే : బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయంలో జరిగే దసరా ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తామని పుర ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. మహాలక్ష్మి ఆలయ నూతన కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన కొడకల శ్రీకాంత్‌ను సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో సన్మానించారు. అనంతరం దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ సి.వి.ఎన్.రాజు, నాయకులు శ్రీనివాస్, అనిల్, రాహుల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


కొడకల శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్

వన సంపద అందరి బాధ్యత

కడెం, న్యూస్‌టుడే : మన భవిష్యత్ తరాలకు అటవీ సంపదను కానుకగా ఇచ్చేలా అంతా వనాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని మండలంలోని ఉడుంపూర్ రేంజి ఎఫ్ఆర్వో అనిత పేర్కొన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉడుంపూర్ వాసులతో సమావేశం ఏర్పాటు చేసి అడవులు, వన్యప్రాణులను కాపాడాల్సిన ఆవశ్యకతను వివరించారు. డీఆర్వో డి.ప్రకాష్, ఎఫ్ఎస్ఓలు సురేందర్, సరిత, పాండురంగ్, సిబ్బంది పాల్గొన్నారు.


అటవీజంతువుల పాదముద్రలు పరిశీలిస్తున్న అధికారులు


గడ్‌చందలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

సభ్యత్వ నమోదులో వేగం పెంచండి

లోకేశ్వరం, న్యూస్‌టుడే : మండలంలోని ఆయా గ్రామాలలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదులో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పాల్గొని వేగంగా పూర్తి చేద్దామని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గడ్‌చంద, పిప్రి, పంచగుడి, ధర్మోర, గొడిసెర, రాయపూర్‌కాండ్లి గ్రామాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ముథోల్ ఇన్‌ఛార్జి సుమన్‌కుమార్, మండల సమన్వయకర్త రమేశ్, సహ సమన్వయకర్త సాయినాథ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అటు ఆహ్వానం.. ఇటు నివేదన

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : ప్రసిద్ధి చెందిన అడెల్లి మహాపోచమ్మకు ఏటా నిర్వహించే గంగనీళ్ల జాతర భక్తులకు కనువిందు చేస్తుంది. సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో సాగే ఈ వేడుకకు భారీసంఖ్యలో ప్రజలు స్వాగతం పలుకుతారు. దిలావర్‌పూర్ మండలానికి చెందిన పలువురు యువకులు సైతం జాతరను స్వాగతిస్తూ ప్రచార ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అదే సమయంలో తమ మండలంలో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దుచేయాలని కోరారు. ఫ్యాక్టరీ వద్దు-పర్యావరణం ముద్దంటూ అందులో తమ ఆకాంక్షను వెలిబుచ్చారు.



యువకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ


మాట్లాడుతున్న టీపీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సచిన్

ఏజెన్సీ డీఎస్సీ వేయాలి : టీపీజేఎస్

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేకంగా ఏజెన్సీ డీఎస్సీ వేసి న్యాయం చేయాలని టీపీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. సోమవారం నిర్మల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహించిన జనరల్ డీఎస్సీలో ఆదివాసీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో స్థానిక గిరిజన అభ్యర్థులతో పోస్టులు భర్తీ చేయాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, నాయకులు సత్యనారాయణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధదమ్మ చక్ర ప్రవర్తన దినోత్సవానికి ఆహ్వానం

నిర్మల్, న్యూస్‌టుడే : భైంసాలో విజయదశమి రోజున నిర్వహించనున్న 68వ బౌద్ధదమ్మ చక్ర ప్రవర్తన దినోత్సవానికి హాజరుకావాలని సోమవారం నిర్మల్‌లో బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో ఎస్పీ జానకి షర్మిలకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీని సన్మానించారు. నాయకులు శంకర్ చంద్రే, ప్రసంజిత్ అగ్రే, దేవిదాస్ హిసిడే, గిరిధర్ జంగ్మే, ప్రభాకర్ గడపాలే పాల్గొన్నారు.


ఎస్పీ జానకి షర్మిలను సన్మానిస్తున్న నాయకులు


శివగంగాదేవికి పూజలు చేస్తున్న స్థానికులు

గంగాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

కుభీరు, న్యూస్‌టుడే: కుభీరులో నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగాదేవి, నందీశ్వరుని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పురోహితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠాపన గావించారు. శివగంగాదేవి ప్రతిమతో గ్రామంలో శోభాయాత్రను నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో దేవీ పాటలు పాడుకుంటూ ముందుకు కదిలారు.

మూలనక్షత్ర వేడుకలకు భారీ బందోబస్తు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే : బాసర ఆలయంలో నిర్వహించే మూల నక్షత్ర వేడుకలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించే బందోబస్తు మార్గాలను సోమవారం రాత్రి ఆలయ ఈఓ విజయరామారావుతో కలిసి పరిశీలించారు. అంతకు ముందు ఏఎస్పీ దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో క్యూలైన్లు, అక్షరాభ్యాస మండపాలు, ప్రసాదాల కౌంటర్, పార్కింగ్ స్థలాలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్సై గణేశ్‌కు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి సుమారు 160 మంది బందోబస్తులో పాల్గొంటారన్నారు. జేఈ రామారావు, ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్ దంపతులు

పార్టీ బలోపేతానికి కృషి

దిలావర్‌పూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రభుత్వ పథకాల అమలుపై పోరాడాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి గౌతంకృష్ణ అన్నారు. సోమవారం పార్టీ బలోపేతానికి కృషి చేసిన సీతారాం ఏచూరి, బక్కన్నల సేవలను గుర్తుచేశారు. ప్రజా పోరాటాలు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ నాయకులు ముత్యం, దుప్పి పోశెట్టి, మాణిక్‌రావు, గంగారెడ్డి, వెంకటేష్, పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

శబ్ద కాలుష్యానికి పాల్పడితే కేసుల నమోదు

దిలావర్‌పూర్: బతుకమ్మ, విజయదశమి వేడుకలకు పరిమితికి మించి డిజేలు ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎస్సై సందీప్ అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో డిజే నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

సారంగాపూర్, దస్తూరాబాద్: అనుమతులు లేకుండా డీజేలు వినియోగించే వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్సై సల్ల శ్రీకాంత్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల డీజే యజమానులతో ఆయన సమావేశమయ్యారు. దస్తూరాబాద్‌లో సీఐ సైదారావు ఎస్సై శంకర్ పాల్గొన్నారు.

యుద్ధంతో తీవ్ర నష్టం

నిర్మల్ అర్బన్: ఇజ్రాయెల్- పాలస్తీనా మధ్య జరుగుతున్న యుద్ధంతో ఇరు దేశాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ముఖ్యంగా అమాయక ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. సోమవారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి మాట్లాడారు.

భైంసాలో బంద్ పాటించిన ముస్లింలు

భైంసా: మహ్మద్ ప్రవక్తపై హరిద్వార్ పూజారి నరసింహానంద సరస్వతి స్వామి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ముస్లింలు సోమవారం బంద్ పాటించారు. పట్టణంలోని వ్యాపార సంస్థలు, దుకాణాలు మూసి ఉంచి నిరసన తెలిపారు.

ముథోల్ : గాజియాబాద్‌లో ప్రవక్త మహ్మద్ సల్లాహుపై సంబంధం లేని ప్రసంగం చేసిన నర్సింహానంద్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ముస్లిం సోదరులు సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్సై సాయికిరణ్‌లకు వినతి పత్రాలను అందజేశారు.

14న భైంసాలో బౌద్ధ దీక్ష

భైంసా : పట్టణంలో ఈ నెల 14న నిర్వహించే దమ్మ చక్ర పరివర్తన దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రీనగర్‌లో దమ్మ దీక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా కార్యదర్శి గాయక్‌వాడ్ భుజంగ్‌రావు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నర్సాపూర్(జి) : యువత క్రీడల్లో రాణించాలని మాజీ సర్పంచులు చెన్న మహేష్, పాపాన్ రాజేశ్వర్‌లు అన్నారు. సోమవారం మండలంలోని గొల్లమాడ గ్రామంలో జీపీఎల్ (గొల్లమాడ ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణ శివారులో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ చెంత గుర్తు తెలియని అనాథ మృతదేహం ఉండగా ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరచిన విషయం తెలిసిందే. మృతదేహం తీసుకెళ్లడానికి ఎవరూ రాకపోవడంతో మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యం, అంత్యక్రియలు నిర్వహించడానికి ముందుకొచ్చిన మైనార్టీ సోదరులకు సోమవారం రాత్రి అప్పగించారు. ఏఎస్సై రాము, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

వినతులు

ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలో ఇటీవల అనుమతి లేని ఆస్పత్రి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో నమోదు కాని వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా పాలనాధికారి, డీఎంహెచ్‌వో కార్యాలయంలో బసపా నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్, నాయకులు అభిషేక్ ఫిర్యాదు చేశామని తెలిపారు.

నిర్మల్ అర్బన్ : సామాజిక మాధ్యమంలో యూట్యూబర్స్‌గా పనిచేస్తున్న వారికి ప్రాధాన్యతమివ్వాలని యూట్యూబర్స్ న్యూస్ ఛానల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు పాలనాధికారి ఫైజాన్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు.

మంత్రిని పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఇటీవల మృతి చెందారు. సోమవారం నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి వెళ్లారు. పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.


మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు


నిర్మల్ అర్బన్ : బతుకమ్మలతో ఆవోపా మహిళా విభాగం సభ్యులు


తిమ్మాపూర్‌లో..

రామ రామ రామ ఉయ్యాలో..

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో తయారు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కుంటాల, ముథోల్: కుంటాలలోని ఆయా గ్రామాల్లో సోమవారం మహిళలు, చిన్నారులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముథోల్ మండలంలోని విఠోలి గ్రామంలో మహిళలు తయారు చేసిన బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి నృత్యాలు, పాటలు పాడుతూ బతుకమ్మ సంబరాలను జరుపుకొన్నారు.

తానూరు(భైంసా) : మండలంలోని భోసిలో సోమవారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు పూలతో తయారు చేసిన సంప్రదాయ బతుకమ్మలను భక్తి శ్రద్ధలతో సామూహిక పూజలు చేశారు.

భైంసా గ్రామీణం: మండలంలోని తిమ్మాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. ఉదయాన్నే గునుగు, తంగేడు, పువ్వులను సేకరించి తీరొక్క పువ్వులతో బతుకమ్మలను పేర్చి భక్తితో పూజించారు.


లింబా(బి)లో బతుకమ్మ వేడుకల్లో మహిళలు


భోసిలో..

మద్దతు ధర దక్కాలంటే..

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : పంటలు చేతికొస్తున్నాయి. క్రయవిక్రయాలు ప్రారంభమవుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కాలంటే ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండాలి. నాణ్యతను పాటిస్తే మద్దతు ధరను పొందే అవకాశం ఉంది. ధర నిర్ణయంలో తేమకు ప్రాధాన్యం ఎక్కువ ఉంటుంది. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు మొదలైన నేపథ్యంలో నాణ్యత, మద్దతు ధరలు పంట విక్రయాలు, కోతలు తదితర వాటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్కెట్ ఏడీ గజానంద్ సూచనలు చేశారు.



పత్తిలో తేమ నిర్ధారణ ఇలా

కోతలో జాగ్రత్తలు

గిట్టుబాటు ధర రావాలంటే రైతులు కోత దశ నుంచి జాగ్రత్తలు తీసుకుంటే పంట నాణ్యతగా ఉంటుంది. ప్రస్తుతం చలికాలం కావున పత్తి ఎండపూట ఏరాలి. పత్తిని కుప్పగా వేయడం వల్ల తేమ అందులోనే ఉండి పత్తి చెడిపోవడమే కాకుండా ధర కూడా రాదు. పత్తి ఏరిన తర్వాత ఆరబెట్టి తీసుకొస్తే తేమ తగ్గుతుంది. వరి పైరు కోసిన తరువాత తేమ తగ్గేందుకు పొలంలో కోసిన చోటనే ఆరబెట్టాలి. ధాన్యంలో తేమ ఒక్కసారిగా తగ్గకూడదు. క్రమక్రమంగా తగ్గాలి. సాధారణమైన ఎండలో పొడిగాలి సన్నగా వస్తున్నప్పుడు ఆరబెట్టాలి. ధాన్యంలో తేమ శాతం 14-16 శాతం ఉండేట్లు చేయడం వల్ల ధాన్యం ఎక్కువ కాలం నిల్వ చేసుకోవచ్చు. మొక్కజొన్న, సోయా, ఇతర పప్పుదినుసుల పంటలు కోతల తరువాత రెండు, మూడు రోజులు ఆరబెట్టి తరువాత నూర్పిడి చేయాలి. తిరిగి రెండు రోజులు గింజలను ఆరబెడితే తేమ పూర్తిగా తగ్గి గిట్టుబాటు ధర వస్తుంది.

నాణ్యత నిర్ధారణ ఇలా..

పత్తిలో తేమ శాతం ఆధారంగా ధర నిర్ణయిస్తారు. 8 శాతం తేమ ఉన్న పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ. 7,521 వస్తుంది. ప్రతి ఒక శాతానికి కిలో ధర తగ్గించి ఇస్తారు. అది కూడా 12 శాతం తేమ వరకే కొనుగోలు చేస్తారు.

- సోయాబీన్‌లో 12 శాతం తేమ లోపు ఉండాలి. చెత్తాచెదారం, పగిలిన గింజలు మూడు శాతం లోపు ఉండాలి.
- మొక్కజొన్నలో 12 శాతం తేమ లోపు ఉండాలి. వేరే పంట పదార్థాలు 0.25-0.75 శాతం వరకు ఉండొచ్చు. దెబ్బతిన్న గింజలు ఒక శాతం లోపు ఉంటే పరవాలేదు.
- పప్పుదినుసుల్లో 12 శాతం, ధాన్యంలో 14 శాతం తేమ లోపు ఉండాలి. అంతకంటే తేమ ఎక్కువగా ధరలో కోత విధిస్తారు. ప్రతి పంటలో తేమను నిర్ధారించే పరికరాలు ఉంటాయి. వాటితో తేమ శాతాన్ని పరిశీలించి ధరను నిర్ణయిస్తారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం



రాజశేఖర్, కీటక శాస్త్రవేత్త
కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్
ఫోన్ నెంబరు : 99085 56659

పత్తి పంటలో కాయకుళ్లు ఆశించింది. నివారణ సూచించండి? - చంద్రశేఖర్, బేల

ఫ్లక్సాపైరక్సాడ్+ పైరక్లోస్ట్రోబిన్ 0.6 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కందిలో ఆకులు పసుపు రంగులోకి మారిపోతున్నాయి. పంటను కాపాడుకోవడం ఎలా? - నాగోరావు, గుడిహత్నూర్

19.19.19 పది గ్రాములు+ఫార్ములా 4 అయిదు గ్రాములు లీటరు కలిపి పిచికారీ చేయాలి.

టమాటాను పిన్‌వార్మ్ ఆశించింది. నివారణ సూచించండి? - రవీందర్, మన్నూర్, గుడిహత్నూర్


ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా ఇండాక్సికార్బ్ 1.75 మి.లీ లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు మందులను మార్చి, మార్చి పిచికారీ చేయాలి.

తక్కువ విస్తీర్ణంలో.. విభిన్న రకాల సాగు

ఆదర్శం

ఏకొద్దిగా చేను ఉన్నా వరి లేదా పత్తి సాగు చేస్తున్న ప్రస్తుత తరుణంలో దండేపల్లికి చెందిన ఎనగందుల భూమయ్య ఉన్న తక్కువ విస్తీర్ణంలో విభిన్న రకాల కూరగాయలు, పూలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయనకు 26 గుంటల పొలం ఉండగా ఇందులో వరి సాగు చేస్తున్నారు. ఇంటి సమీపంలో ఉన్న 14 గుంటల్లో ఉన్న పెరడులో కూరగాయలు, పూల సాగు చేస్తున్నారు. వానాకాలం ప్రారంభంలో బెండ, వంకాయ, అల్లంత తదితర కూరగాయలు సాగు చేస్తారు. వీటిని స్థానిక సంతకు తీసుకువెళ్లి విక్రయిస్తారు.. చాలా మంది ఇంటికే వచ్చి తీసుకెళ్తుంటారు. పంట చేతికి రాగానే తీసేసి పూలను సాగు చేస్తారు.. గతేడాది సీతమ్మ జడలు, బంతి తదితర పూలు సాగు చేయగా ఈసారి సీతమ్మ జడలు సాగు చేస్తున్నారు. బతుకమ్మ, దీపావళి తదితర పండగలకు పూలు చేతికొస్తాయి. దీంతో ఆదాయం సమకూరుతుంది. సీజన్ పూర్తి కాగానే తిరిగి కూరగాయలు సాగు చేస్తారు. ఇలా వేసవి పూర్తయ్యే వరకు రెండు సార్లు వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో వరితో పాటు పూలు, కూరగాయలు సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు.

- న్యూస్‌టుడే, మంచిర్యాల వ్యవసాయం



పూలసాగు చేస్తున్న భూమయ్య

నాణ్యమైన నారు కావాలంటే..

మీకు తెలుసా?

కూరగాయలను కాలంతో సంబంధం లేకుండా సాగు చేస్తుంటారు. యాజమాన్య పద్ధతులు పాటించి కూరగాయల నారు పెంచితేనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉద్యానవన అధికారి అనిత పేర్కొన్నారు. పాలీహౌస్, షేడ్ నెట్లలో పెంచితే నాణ్యమైన నారు వస్తుంది. కూరగాయలకు కోకోపిటు మిశ్రమం టన్నుకు కిలో విత్తనాలు విత్తే పది రోజులు ముందు కలిపితే నారు కుళ్లు తెగులు నివారించవచ్చు. కిలో విత్తనశుద్ధికి నాలుగు గ్రాముల ట్రైకోడెర్మా 1.5 గ్రా. ఉపయోగించాలి. నారు పెరిగే సమయంలో కుళ్లు తెగులు ఆశించకుండా మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి చల్లుకోవాలి.

- న్యూస్‌టుడే, దండేపల్లి

చిచ్చర పిడుగులు.. క్రికెట్‌లో వీరులు

● ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయికి ఎంపిక



న్యూస్‌టుడే, మంచిర్యాల క్రీడావిభాగం: వ్యక్తిగత క్రీడల్లో రాణించడం.. ఉన్నతస్థాయికి చేరుకోవడం వారి స్వీయ శిక్షణ, సాధనపై ఆధారపడి ఉంటుంది. కానీ గ్రూపుగా తలపడే క్రీడలో చోటు దక్కించుకోవడం అంత సులువేం కాదు. నిత్యం కసరత్తు చేయాలి.. తనకంటూ ప్రత్యేకత చాటుకోవాలి. మెరుగైన ప్రదర్శనతో సెలక్టర్లను ఆకట్టుకోవాలి. ముఖ్యంగా క్రికెట్ జట్టుకు ఎంపిక అవడమంటే ఆశామాషీ వ్యవహారమేమీ కాదు. అలాంటి ఈ ఆటలో పదిహేనేళ్లు కూడా నిండని జిల్లాకు చెందిన చిన్నారులు సత్తాచాటుతూ ఉన్నతస్థాయికి చేరుకుంటున్నారు. జిల్లా, జోనల్ స్థాయిలో ఉత్తమ ఆటతీరును కనబరిచి రాష్ట్ర స్థాయిలో తలపడేందుకు సిద్ధమవుతున్నారు.

బ్యాటింగ్‌లో మెరిసి.. రాష్ట్ర స్థాయికి చేరి



జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న వేములపల్లి లక్ష్మణ్ సాయి బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపిస్తున్నాడు. కుడి చేతి వాటంతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. ఇటీవల పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వహించిన జిల్లా, జోనల్ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. తొలిసారి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో పాటు జట్టులో కీలకమయ్యాడు. గురు అకాడమీలో శిక్షణ పొందుతున్న లక్ష్మణ్ ఆయా పోటీల కోసం ఉదయం, సాయంత్రం కసరత్తు చేస్తున్నాడు.

ఎడమ చేతి వాటం.. ఆల్‌రౌండ్ ప్రతిభ



కొంతకాలంగా మంచిర్యాల పట్టణంలోని అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎడ్ల రిషికేష్‌చంద్ర తన ఎడమచేతి వాటం బ్యాటింగ్, బౌలింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు. బ్యాటింగ్‌లో చూడచక్కని షాట్లు.. లైన్ అండ్ లెన్త్ బౌలింగ్‌తో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నాడు. గతేడాది సైతం ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకోగా ఈ ఏడాది మరింత మెరుగైన ప్రదర్శనతో ఉమ్మడి జిల్లా జట్టును విజయతీరాలకు చేర్చాలని సిద్ధమవుతున్నాడు.

తండ్రి శిక్షణ.. మెరుగైన ప్రదర్శన



జిల్లాలోని రామకృష్ణాపూర్ క్రికెట్ జట్టు అంటే బింగి దుర్గాప్రసాద్‌ను గుర్తుకు తెచ్చుకోవాల్సిందే. తన బ్యాటింగ్‌తో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. విశ్వవిద్యాలయ కెప్టెన్‌గా వ్యవహరించి మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అతని అడుగుజాడల్లోనే నడుస్తూ కుమారుడు అర్జున్ రాణిస్తున్నాడు. తండ్రి శిక్షణలోనే మెలకువలు నేర్చుకుంటూ మెరుగైన ఆటతీరును కనబరుస్తున్నాడు. మరోసారి ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఎడమచేతి వాటం బ్యాటింగ్, ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌తో జట్టులో కీలక సభ్యుడు కాగా అందుకు తగ్గట్టుగా ముమ్మర సాధన చేస్తున్నాడు.

బ్యాటింగ్‌లో ధనాధన్.. కీపింగ్‌లో మెరుపు వేగం



ఓపెనర్‌గా వచ్చిరావడంతోనే తనశైలిలో దంచికొట్టడం పులిపాక వికాస్ సొంతం. బౌలర్ ఎవరైనా, బంతి ఎంత వేగంతో వచ్చినా స్టాండ్స్‌లోకి పంపడమే అతనికి తెలుసు. ఆ ఆటతీరుతోనే జిల్లా, జోనల్ స్థాయిలో సత్తాచాటి తొలిసారి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బ్యాటింగ్‌లో రాణించడమే కాకుండా కీపింగ్‌లోనూ జట్టుకు అదనపు బలం చేకూరుస్తున్నాడు.



దుబాయ్ స్టేడియంలో బతుకమ్మ ఉత్సవంలో వివిధ జిల్లాల వాసులు



నృత్యం చేస్తున్న మహిళలు, పిల్లలు



బతుకమ్మ ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న డోలు కళాకారులు

ఎడారి నేలపై పూల పండగ

మామడ, మందమర్రి పట్టణం- న్యూస్‌టుడే : ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక, సంక్షేమ సంఘం(ఈటీసీఏ) ఆధ్వర్యంలో దుబాయ్‌లో బతుకమ్మ సంబురాలు కన్నులపండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు ఈ కార్యక్రమాన్ని అక్కడి అల్ అహ్లీ ఇండోర్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఘనంగా జరుపుకొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు పెద్ద సంఖ్యలో ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో దుబాయ్‌లో ఏటా నిర్వహించే పూలపండగకు ముఖ్య అతిథిగా వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. బతుకమ్మ ఉత్సవాలు ఆకట్టుకున్నాయని నిర్మల్‌కు చెందిన రాజు, రాజశేఖర్ తెలిపారు. ఈటీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, కళాకారులు, సందడి చేసినట్లు జిల్లావాసులు వివరించారు.

పాత పింఛను హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్



జన్నారంలో మాట్లాడుతున్న సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్

జన్నారం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు పాత పింఛను విధానాన్ని తీసుకురావాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ అన్నారు. జన్నారంలో సోమవారం సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. మేనిఫెస్టోకు అనుకూలంగా జీవోను విడుదల చేసి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన ఝార్ఖండ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, పంజాబ్ రాష్ట్రాల్లో పాత ఫింఛన్ విధానం అమలు చేశారన్నారు. 1.9.2004కు ముందు విడుదలైన ఉద్యోగ ప్రకటన ద్వారా నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు 57/5 ప్రకారం పాత పింఛన్ విధానం అమలుతో ఇతర రాష్ట్రాల్లో వేలాది మంది ఉద్యోగులకు మేలు జరిగిందని అన్నారు. 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు దసరా పండగ కానుకగా పాత పెన్షన్ అమలు చేయాలని ఆయన కోరారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో బోధిస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బానోత్ ప్రకాశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమలికొండ కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆమె చేతుల్లో.. అద్భుత కళా నైపుణ్యం

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా ఏదో ఒకటి చేయాలని ఆలోచించారు ఈ అతివలు. కుట్లు, అల్లికలు కాకుండా భిన్నంగా తమకంటూ ప్రత్యేకత చాటుకొనేలా వస్తువుల తయారీ మార్గాన్ని ఎంచుకొన్నారు. గృహాలంకరణకు ఉపయోపడే వివిధ రకాల వస్తువులు, దేవుళ్ల ప్రతిమలు తయారు చేస్తూ అబ్బుర పరుస్తున్నారు.

దూదితో వస్తువుల తయారీలో భాగ్యలక్ష్మి



ఉట్నూరు మండలం లక్కారం గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి కిరాణ దుకాణం నడిపించే తన భర్త వట్టంవార్ ప్రసాద్‌కు వ్యాపారంలో సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఖాళీ సమయంలో ఇంట్లో దూదితో అలంకరణ వస్తువులు తయారు చేస్తున్నారు. దేవుళ్ల ప్రతిమల అలంకరణ కోసం మాలలు, నల్లపూసల గొలుసులు, నెక్లెస్‌లను తయారు చేస్తున్నారు. కొత్త ఆలోచనలతో వినూత్న వస్తువులు తయారు చేయడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నానని భాగ్యలక్ష్మి పేర్కొన్నారు.

పాడైన వస్తువులు వినియోగంలోకి తెస్తూ..



ఇంద్రవెల్లి మండలానికి చెందిన శశికళ తన భర్త చంద్రబాన్ ప్రోత్సాహంతో పాడైన వస్తువులతో ఆకర్షణీయమైన గాజులను తయారు చేస్తున్నారు. పాడైన వస్తువులను సేకరించి వాటితో ఆకట్టుకొనేలా గాజులు తయారు చేస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు.

ఆకట్టుకునేలా వస్తువుల అలంకరణలో స్వప్న



ఉట్నూరుకు చెందిన స్వప్న గృహిణి. పండగలు, శుభకార్యాల కోసం పూలు, ఇతర వస్తువులతో ఆకర్షణీయంగా వస్తువులను అలంకరిస్తారు. తన భర్త సునీల్ కుమార్ ప్రోత్సాహంతో వినాయక చవితి, దుర్గాదేవి నవరాత్రుల వేళ దేవుని ప్రతిమలకు సమర్పించే హారతి, లడ్డులు, మహిళలకు వేసే వివిధ రకాల మెహందీ డిజైన్ల అలంకరణ ఆకట్టుకునేలా చేపడుతున్నారు.

ప్రతిమల రూపకల్పనలో నాగమణి





గౌరీ దేవి(గౌరమ్మ), వినాయకుడు, దుర్గాదేవి ఇలా ఏ దేవుళ్ల ప్రతిమ అయినా పసుపు, మైనంతో ఉట్నూరుకు చెందిన నాగమణి తయారు చేస్తున్నారు. భర్త తాటికొండ రమేష్ వ్యాపారస్థుడు. ఆయనకు చేదోడువాదోడుగా ఉంటూనే నాగమణి గాజు ముక్కలతో ఓం, శివలింగం ఇతర వస్తువులు తయారు చేస్తున్నారు.

ప్రతి జిల్లాలో ఔషధ నిల్వ కేంద్రం ఏర్పాటు

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే: పలు జిల్లాల్లోని ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో ఔషధాల కొరత ఉన్నట్లు సమాచారం వస్తుండటంతో సమస్యను పరిష్కరించటానికి ప్రతి జిల్లాలో ఔషధ నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని పలు ఆసుపత్రుల్లో సమస్యలను తెలుసుకోవటానికి వైద్యారోగ్యశాఖ మంత్రి సూచనల మేరకు తాను జిల్లాలో ఆసుపత్రులను పరిశీలించడానికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఔషధ నిల్వ కేంద్రాల్లో కొరత ఉన్న మందులను కొనుగోలు చేయటానికి వీలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇవి జిల్లా పాలనాధికారి పర్యవేక్షణలో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రిమ్స్ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రిమ్స్‌తో పాటు అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని సౌకర్యాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. రిమ్స్ సంచాలకుడు రాఠోడ్ జైసింగ్, ఆర్ఎంఓ తొడ్సం చందు, వైద్యులు తిప్పేస్వామి, సందీప్ జాదవ్ తదితరులున్నారు.



రిమ్స్ అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

రాష్ట్ర స్థాయి బాక్సింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ


నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లోని షేక్‌పేట్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చందుల స్వామి తెలిపారు. జూనియర్స్ విభాగంలో వివిధ బరువుల్లో (44-46లో) వి.అక్షయ, (50-53లో) పి.అభినయ, (60-63లో) బి.శ్రావణి వెండి పతకాలు, (44-46లో) ఎం.వైష్ణవి, (46-48లో)ఎన్.జ్యోతి, సబ్ జూనియర్ (35-37లో) కె.నందిని కాంస్య పతకాలు సాధించారు. డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

సంస్కృతికి మకుటం.. సంబరాల పాఠం


● రెండో తరగతి తెలుగు వాచకంలో 'బతుకమ్మ' పాటలు

న్యూస్‌టుడే, కుంటాల : చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువును, సంస్కృతిని నేర్పించాలనే ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలనిస్తోంది. ఈ మేరకు ప్రాథమిక తరగతుల్లోని తెలుగు పాఠ్యపుస్తకాల్లో ఒక్కో తరగతిలో ఒక్కొక్క సంస్కృతి, సంప్రదాయాలు, ప్రభుత్వ పథకాలపై విద్యార్థులకు అవగాహన కలిగించేలా పాటలు, పాఠ్యాంశాలు పొందుపరిచారు. 'జాబిలి-2' పేర రూపొందించిన రెండో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో 'బతుకమ్మ' సంబరాలను అయిదు పాఠ్యాంశాలుగా చేర్చారు. విద్యార్థులు పాటలను నేర్చుకోవడంతోపాటు బతుకమ్మ ప్రాముఖ్యం, సంస్కృతిని వంట పట్టించుకున్నారు. బతుకమ్మను పేర్చేందుకు పూలను కోసుకురావడం నుంచి మొదలుకొని బతుకమ్మను పేర్చడం, బతుకమ్మలెత్తుకొని ఊరి మధ్యలోకి తీసుకెళ్లి పెట్టడం, బతుకమ్మలాడటం, నిమజ్జనం చేసే వరకు వరుస క్రమంలో పాఠ్యాంశాలను పొందుపరిచారు.

✦ తెలుగు వాచకంలో మొదటి పాఠ్యాంశమైన 'రంగురంగుల పూలు'తో బతుకమ్మను పేర్చేందుకు ఉపయోగించే 22 రకాల పూల పేర్లు వచ్చేలా పాటను రూపొందించారు. బతుకమ్మ సంబరంలో తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా చిన్నారులు, మహిళల అలంకరణను 'ఓణీలు జడకుచ్చులు ఉయ్యాలో, ఒయ్యారమొలకంగ ఉయ్యాలో, బుట్టబొమ్మలోలే ఉయ్యాలో, బుజ్జిపాపలు కదలి ఉయ్యాలో, అద్దాల రవికలు ఉయ్యాలో, ముత్యాల చీరెలు ఉయ్యాలో, నడుముకూ వడ్డాణం ఉయ్యాలో, నాణ్యమైన నగలు ఉయ్యాలో, నిండైన గాజుల్ల ఉయ్యాలో, బతుకమ్మలెత్తిరి ఉయ్యాలో, నడిచేటి పాదాలు ఉయ్యాలో, నదులను బోలు ఉయ్యాలో.. అంటూ 'బతుకమ్మలెత్తుదాం'లో పేర్కొన్నారు.



రంగురంగుల పూల పాఠం



బతుకమ్మలెత్తుదాం



వానల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

✦ 'నిద్దుర పోమ్మంటు చందమామ, జోలపాటలు పాడి చందమామ, పోయిరా గౌరమ్మ చందమామ, మరలింరావే తల్లి చందమామ..' అంటూ సద్దుల బతుకమ్మ రోజున నిమజ్జనం గురించి 'పోయిరా గౌరమ్మ'లో పొందుపరిచారు. ఇలా.. తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపంగా నిలిచిన బతుకమ్మ పండుగపై సంపూర్ణ అవగాహనను పెంచుకున్న చిన్నారులు ప్రస్తుతం నిత్యం ఆయా బస్తీల్లోని చిన్నారులు బతుకమ్మలను పెట్టుకుని ఇవే పాటలను చదువుకుంటూ చిందులేసుకుంటూ సంబరంగా ఆడుకుంటున్నారు.